

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

శనివారం,14 మార్చి 2026 8 పేజీలు


## ఏపీలో తోటపంటల అభివృద్ధికి

# రూ.708 కోట్ల కేంద్ర నిధులు

**- ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నకు కేంద్రం లిఖితపూర్వక సమాధానం**



**ఉమ్మడిగోదావరిజిల్లాల సూర్యబ్యూరో:** ఆంధ్రప్రదేశ్‌లో జీడిపప్పు, కొబ్బరి, కోకో వంటి అధిక విలువ కలిగిన తోటపంటల సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. 2024 నుంచి 2027 ఆర్థిక సంవత్సరాల కాలానికి గాను మొత్తం రూ.708కోట్లను మంజూరు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. రాజ్యసభలో ఎంపీ సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.రాష్ట్రంలో తోటపంటల విస్తీర్ణం, ఉత్పాదకత పెంచి రైతుల ఆదాయాన్ని ద్విగుణీకృతం చేయడమే లక్ష్యంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.108.33 కోట్లు, 2025-26కు రూ.250.00 కోట్లు, మరియు 2026-27 బడ్జెట్‌లో రూ.350.00 కోట్లు కేటాయించారు. కేంద్ర మంత్రి తెలిపిన గణాంకాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో జీడిపప్పు 2.01 లక్షల హెక్టార్లలో సాగులో ఉండగా, 2025-26లో రూ.3.86 కోట్ల నిధులతో 3,616 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.కొబ్బరి1.08లక్షల హెక్టార్లలో సాగులో ఉండగా,రూ.11.31కోట్ల నిధులతో 7,153 మంది రైతులను లక్ష్యంగా చేసుకున్నారు. అలాగే 47వేల హెక్టార్లలో సాగులో ఉన్న కోకో పంటకు రూ.9.46కోట్ల నిధులతో 3,394 మంది రైతులకు ప్రయోజనం కలగనుంది.రాష్ట్ర మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో కొబ్బరి 3.86%, జీడిపప్పు 0.45%, కోకో 0.04% వాటాను కలిగి ఉన్నాయి. 'మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్

- తరువాయి 2లో..

## కబ్జా కోరల్లో

# 'కుష్టు' రోగుల భూములు

ఇంతకంటే నీచం మరొకటి ఉంటుందా?

- అధికారుల 'నిమ్మకు నీరెత్తిన' తీరుపై వాసంశెట్టి సత్యం అసహనం!
- బాధితులకు అండగా కూటమి నాయకులు...
- రెవెన్యూ, లెప్రసీ శాఖల పనితీరుపై దిశానిర్దేశం!





**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** ఎవరూ లేని అనాథలు, సమాజం వెలివేసిన కుష్టు వ్యాధిగ్రస్తుల సేవ కోసంకేటాయించిన భూములపై భూబకాసురు లు కన్నేయడం పరాకాష్టకు చేరుకుంది. "ఆర్.సి. పురం లెప్రసీ మిషన్ భూముల కబ్జా కంటే నీచమైన పని మరొకటి ఉంటుందా?" అని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో ప్రశ్నిస్తున్నారు.ఈఅక్రమాలను సహిం చేది లేదని,బాధితుల పక్షాన నిలబడతామని కూటమి నాయకులు, వాసంశెట్టి సత్యం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వాసంశెట్టి సత్యం స్పష్టం చేశారు.

**క్షేత్రస్థాయిలో వాసంశెట్టి సత్యం పర్యటన**
**-అధికారులపై విస్మయం**

రాష్ట్రంలోకూటమిప్రభుత్వం ప్రజాపక్షాన నిలుస్తుంటే, కొందరు అధికారులు మాత్రం పాతపద్ధతులనే అవలంబిస్తూ భూబకాసురులకు పరోక్షంగా సహకరి స్తున్న తీరుపై వాసంశెట్టి సత్యం

- తరువాయి 2లో..

## రైతుల అభ్యున్నతికి

# ప్రభుత్వం కృషి

- రాజవరం నదీ కోత నివారణకు పటిష్ట చర్యలు
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.శుక్రవారం మండలంలోని రాజవరంలో గోదావరి నదీ కోతకు గురవుతున్న లంక పొలాలను శుక్రవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్య పూర్వాపరాలను తెలుసుకున్నారు. గతంలో ఇక్కడ మట్టి తవ్వకాలు జరగడం వల్ల నేల వదులై పొలాలన్నీ కోతకు గురవుతున్నాయని రైతులు ఆయన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల విలువచేసే భూములు గోదావరిలో కలిసిపోతున్నాయన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నదీ కోతను అరికట్టడానికి

- తరువాయి 2లో..

## 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని

# సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ శిరీషాదేవి



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ప్రాధాన్యత ప్రకారం ప్రతీ దరఖాస్తు పరిష్కారం చేస్తామని,ప్రజాదర్బార్' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంతమోహన్‌ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తుదారులు వారి సమస్యలపై ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో పాటుదరఖాస్తులు అందించాలని సూచించారు. ప్రతీ దరఖాస్తు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వై.రామవరం తహసిల్దార్ ఇటీవల ఒక సచివాలయ ఉద్యోగిని ప్రమాద సంఘటనపై ఆమెను కలిసి

- తరువాయి 2లో..

## కాకినాడ జిల్లాలో

# 'పులి' కలకలం

**శంఖవరం అడవుల్లో హై అలర్ట్!**



**ప్రత్తిపాడు/శంఖవరం,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో గత కొన్ని రోజులుగా పెద్దపులి సంచారం స్థానికులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. శంఖవరం మండలం గౌరంపేట పంచాయతీ పరిధి లోని రాజవరం, మాసంపల్లి గ్రామాల మధ్య ఉన్న సరుగుడుతోటల్లోపులి తిరుగుతు న్నట్లు అటవీశాఖ అధికారులు ధృవీకరిం చడంతో జనం హడలిపోతు న్నారు.

**రేడియో కాలర్ రహస్యం-సాంకేతిక నిఘా**

ఈపులి కదలికలను కనిపెట్టడంలో జీపీఎస్ రేడియో కాలర్ కీలకపాత్ర పోషిస్తోంది. గతంలో ఏదైనా టైగర్ రిజర్వ్ పరిధిలో ఈ పులిని గుర్తించిన శాస్త్రవేత్తలు, దానికి మత్తుమందు ఇచ్చిశాస్త్రీయ అధ్యయనం కోసం ఈకాలర్‌ను మెడలో అమర్చారు. ఇది శాటిలైట్ ద్వారా నిరంతరం సిగ్నల్స్‌ను కంట్రోల్ రూమ్‌కు పంపిస్తుంది. ఒకవేళ సాంకేతిక లోపం వల్ల సిగ్నల్ నిలిచిపోతే అధికారులకు సవాలు తప్పదు. అటువంటి సమయంలో కేవలం థర్మల్ సెన్సార్ డ్రోన్లు, అడవిలో అక్కడక్కడా అమర్చిన కెమెరా ట్రాప్‌లు, మరియు

- తరువాయి 2లో..

# ఒకే అంబులెన్స్‌లో మూడు మృతదేహాల తరలింపు! ఇదేనా గిరిజనుల అభివృద్ధి?





– గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు

రంపచోడవరం,మేజర్‌న్యూస్ : గిరిజనాభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ కాలం విలదీస్తుందని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు విమర్శించారు. కనీసం చనిపోయిన వారిని ప్రభుత్వ ఆసుపత్రి నుండి వారి స్వగ్రామాలకు 160 కిలోమీటర్లు (వేరు వేరు గ్రామాలు) తరలించడానికి మహాప్రస్థానం లేని దయనీయ స్థితిలో ఈరోజు పోలవరం జిల్లాలో గిరిజనుల పరిస్థితి ఉందని రామారావు ఆరోపించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించిన మూడు వేర్వేరు మండలాలకు చెందిన గిరిజన మృతదేహాలను సుమారు 160 కిలోమీటర్లు ఒకవైపు ప్రయాణంలో మహా ప్రస్థానంలో తరలించడానికి చనిపోయిన బాడీలను తీసుకువెళ్లడం కోసం గిరిజనులు వారి మృతదేహాల వెంట వెళ్లలేని పరిస్థితులలో కన్నీటి పర్యంతమైయ్యారని, వారి బాధను చూసేవారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని రామారావు పేర్కొన్నారు. దేవీపట్నం, కొయ్యూరు, గుర్తేడు మూడు మండలాలకు చెందిన మూడు మృతదేహాలు ఎప్పటికీ వారి గమ్యం చేరుతాయో తెలియదని బాధిత గిరిజనులు బాధపడు తుంటే అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమని రామారావు వెల్లడించారు. రెండు మృతదేహాలను తీసుకొని మహా ప్రస్థానం అంబులెన్సు పెద్దాపురం వరకు బాడీలను తీసుకొని వచ్చేసరికి మరో మృతదేహం ఉందని కాకినాడ హాస్పిటల్ నుంచి ఫోన్ రావడంతో గంటల తరబడి అక్కడే అంబులెన్స్ ఉందన్నారు. ఒకే అంబులెన్సులో మూడు మృతదేహాలు తరలింపు జరిగిందని, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఇద్దరు చిన్నారులు, ఒక మహిళ మరణించారన్నారు. వీళ్ళందర్నీ కాకినాడ నుండి మారేడుమిల్లి మీదుగా స్వగ్రామాలకు వెళ్లడానికి ఒకే అంబులెన్స్ లో పంపించారన్నారు. వీరిలో కొయ్యూరు మండలం కొమ్మనూరు గ్రామానికి చెందిన శిశువు మరణించిందని, గుర్తేడు మండలం దుంపవలస గ్రామానికి చెందిన సోమాలమ్మ జన్మనిచ్చిన శిశువు మరణించిందని తెలిపారు. దేవీపట్నం మండలం దోనలంక గ్రామానికి చెందిన స్వర్ణలత (30) మరణించిందని, వీరి ముగ్గురిది వేరు వేరు ప్రాంతాలు అయినప్పటికీ ఒకే అంబులెన్స్ లో తరలించడం జరిగిందని రామారావు అన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని చాలా గొప్పగా చెబుతున్నారని, కానీ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా గిరిజనుల యొక్క ఇబ్బందులు, ఆవేదన ప్రభుత్వానికి, ప్రభుత్వ అధికారులకు పట్టడం లేదన్నారు. గిరినాభివృద్ధి అంటే ఇదేనా అని లోత రామారావు ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని, ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు.

# కాకినాడ జిల్లాలో 'పులి' కలకలం

మొదటిపేజి తరువాయి

పులి అడుగుజాడల ఆధారంగానే గాలింపు చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం సిగ్నల్ అందుతుండటంతో పులి ఎక్కడుందో అధికారులు ఎప్పటికప్పుడు పసిగట్టగలుగుతున్నారు.

**రంగంలోకి ఎన్ఎస్‌టీఆర్ నిపుణులు**

పులిని బంధించే ఆపరేషన్ అత్యంత క్లిష్టమైనది కావడంతో, నాగార్జునసాగర్ – శ్రీశైలం టైగర్ రిజర్వ్ నుండి ప్రత్యేక నిపుణుల బృందాలను పిలిపించినట్లు సమాచారం. వీరు రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ మరియు వెటర్నరీ డాక్టర్లతో కలిసి సంయుక్తంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొననున్నారు. ముఖ్యమైన అంశాలు

**ఎన్‌టిసిఎ అనుమతి...**

పులిని బంధించే ముందు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ నుండి ముందస్తు అనుమతి తప్పనిసరి. ఆ అనుమతి రాగానే ఆపరేషన్ ముమ్మరం కానుంది.

– ట్రాంక్విలైజర్ సిద్ధం : అవసరమైతే పులికి మత్తుమందు ఇచ్చి అదుపులోకి తీసుకునేందుకు మత్తు తుపాకులతో నిపుణులు సిద్ధంగా ఉన్నారు.

– బోన్ల ఏర్పాటు: పులి సంచార మార్గాల్లో ఇప్పటికే భారీ ఇనుప ట్రాప్ బోన్లను అధికారులు ఏర్పాటు చేశారు.

**డ్రోన్లతో గాలింపు.. ప్రజలకు హెచ్చరిక**

అటవీ ప్రాంతం దట్టంగా ఉండటంతో పులి కంటికి కనిపించకుండా తప్పించుకునే అవకాశం ఉంది. అందుకే, హై–టెక్ డ్రోన్లు మరియు అడవిలో వివిధ చోట్ల ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్‌లద్వారా ప్రతి కదలికపై నిఘా ఉంచారు. శంఖవరం మండలంలోని గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని, పొలాలకు వెళ్లేటప్పుడు ఒంటరిగా వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరో రెండు రోజుల్లో పులిని పట్టుకుని సురక్షితమైన అటవీ ప్రాంతానికి తరలించే అవకాశం ఉందని అటవీశాఖ ఉన్నతాధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మొదటిపేజి తరువాయి

న్యాయం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఆమె రంపచోడవరం ఐటీడీఏ పిఓతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపించాలని కోరారు. అలాగే రోడ్డు విస్తరణ లో షాపులు కోల్పోయిన గిరిజనులకు ప్రత్యామ్నాయం ఇస్తామని నేటికీ ఇవ్వలేదన్నారు. దీనిని త్వరలో పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఆలాగే కొన్ని మౌలిక వసతులు కల్పన కోసం దరఖాస్తులు రాగావెంటనే స్పందించిన ఆమెఆయా శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారం చూపించాలని ఆదేశించారు. రంపచోడవరం మండలంలో త్రాగునీటి సమస్య కోసం ఆమె దృష్టిలో పెట్టగా ఎంపిడిఓతో మాట్లాడి వెంటనే పరిష్కారం చేయాలన్నారు. పిడతమామిడి గ్రామంలో సెల్ టవర్ లేకపోవటంతో చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపి టవర్ నిర్మాణం కోసం విన్నవించారు. ఈసమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇస్తూ సంబంధిత అధికారులకు టవర్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభానీ, రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, ఏఎంసి వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, సీతపల్లి గుడి చైర్మన్ కుంజం బాపన్నదొర, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, కోసు నాగన్న దొర, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి, మారేడుమిల్లి మండల పార్టీ అధ్యక్షులు గురుకు శేషకుమార్, జనసేన నాయకులు పాపోలు శ్రీనివాసరావు, గంగవరం మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకట రెడ్డి, దేవీపట్నం మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల చంటిబాబు, మాజీ సర్పంచ్ నిరంజనీ దేవి, సీతపల్లి గుడి దేవస్థానం సభ్యులు సిద్ధ వెంకన్న దొర, రంపచోడవరం ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులు షేక్ చోటు, తెదేపా సీనియర్ నాయకులు గణజాల తాతారావు, దేవీపట్నం సొసైటీ అధ్యక్షులు మాగాపు బాబురావు, జనసేన మారేడుమిల్లి అధ్యక్షులు మల్ల దుర్గ ప్రసాద్, గంగవరం మాజీ ఎంపీపీ తీగల ప్రభ, కోసు రామన్న దొర, పరదా సత్యవేణి, బీజేపీ సత్యనారాయణమ్మ, రంపచోడవరం ఎంపిడిఓ ప్రసాద్, రెవిన్యూ ఆర్ఐ నిర్మల కుమారి, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో తోటపంటల అభివృద్ధికి రూ.708 కోట్ల కేంద్ర నిధులు

మొదటిపేజి తరువాయి

ఆఫ్ హార్టికల్చర్' (ఎంఐడిహెచ్) పథకంద్వారాఈమద్దతు అందుతోంది.ఏపీలో తోటపంటలవిస్తరణకు కేంద్రంనుంచి మరిన్నినిధులు,సాంకేతిక సహకారం అందించాలని ఎంపీ సానా సతీష్ బాబు ఈ సందర్భంగా కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

# కబ్జా కోరల్లో 'కుష్టు' రోగుల భూములు

మొదటిపేజి తరువాయి

తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మిషన్‌కు చెందిన కోట్లాది రూపాయల విలువైన భూముల ఆక్రమణపై ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి, రోడ్డుపై ధర్నా చేస్తున్న బాధితులకు భరోసానిచ్చారు.

**ప్రశ్నల వర్షం.. అధికారుల ఉక్కిరిబిక్కిరి!**

సత్యం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అలుపెరగని సేవలు అందిస్తున్న ఆయన, అధికారుల నిర్లక్ష్యాన్ని నిలదీశారు:

8.56 ఎకరాల లెక్క ఏది? సర్వే నంబర్ 540లో ఉన్న ఈ విస్తీర్ణంలో ఎంత భూమి ఆక్రమణకు గురైంది? ప్రస్తుతం ఎంత మిగిలి ఉంది?

**రిజిస్ట్రేషన్ల మాయాజాలం:** వివాదాస్పద భూముల్లో రిజిస్ట్రేషన్లు ఎలా జరుగుతున్నాయి? వీటిని ఎందుకు ఆపలేదు? ఎవరి పేర్లతో మ్యూటేషన్లు జరిగాయి?

**కళ్లు మూసుకున్న యంత్రాంగం:** కళ్లముందే కబ్జాలు జరుగుతుంటే, అధికారులు మౌనం వహించడం వెనుక ఉన్న అసలు రహస్యమేమిటి?

**వ్యవస్థలు మారాలి – సత్యం గట్టి హెచ్చరిక**

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రిగా, బాధ్యతాయుతమైన కూటమి నాయకుడిగా సత్యం అన్న అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ప్రభుత్వ విధానాలు మారాయి, అధికారులు తమ పాత అలవాట్లు మార్చుకుని ప్రజల కోసం పరిగెత్తాలి. పేదల కోసం కేటాయించిన భూములను కాపాడటంలో విఫలమైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి" అని స్పష్టం చేశారు.

**సంపూర్ణ నివేదికకు ఆదేశం**

ఈ భూ ఆక్రమణల ఉదంతంపై సమగ్రమైన మరియు సంపూర్ణ నివేదికను తక్షణమే సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. బాధితులు న్యాయం కోసం వీధుల్లో పోరాడుతుంటే, అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడం అన్యాయమని, అక్రమార్కులు ఎంతటి వారైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు.

ప్రజల ప్రశంసలు: సేవ కోసమే పుట్టిన 'వాసంశెట్టి సత్యం చారిటబుల్ ట్రస్ట్' నేడు నిస్సహాయులైన కుష్టు వ్యాధిగ్రస్తుల భూములను కాపాడేందుకు నడుం బిగించడం, కుష్టి రోగులకు చారిటబుల్ ట్రస్ట్ తరఫున సహాయ సహకారాలు అందించడంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మొదటిపేజి తరువాయి

పటిష్టమైన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. గ్రోయిన్ల నిర్మాణానికి రూ. 38కోట్లు 50 లక్షలు అవసరమవుతాయని అధికారులు తెలిపారని ఈ అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లినట్లు ఆయన తెలిపారు. ప్రతిపాదనలు ఆమోదం పొందగానే గ్రోయన్ల నిర్మాణానికి కృషి చేస్తాననిఅన్నారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, నాయకులు ముళ్ళపూడి భాస్కరరావు, మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు, జానా ఆంజనేయులు, నరాల శెట్టి వెంకన్న, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# జెఎన్టీయుకె విద్యార్థికి 'మెడాలియన్ ఫర్ ఎక్సలెన్స్' పురస్కారం

– వైస్ చాన్సలర్ కార్యాలయంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడలో మెకానికల్ ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి లీలకృష్ణ వేములపల్లి జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయానికి గౌరవం తీసుకొచ్చారు. ఇండియా స్కిల్స్ 2025–26 దక్షిణ ప్రాంతీయ పోటీలలో అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన మెడాలియన్ ఫర్ ఎక్సలెన్స్ పురస్కారాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఆయనను అభినందిస్తూ శుక్రవారం వైస్ చాన్సలర్ కార్యాలయంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కే.ప్రసాద్ లీలకృష్ణ వేములపల్లికి భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఎంఎస్‌డిఈ) అందజేసిన అధికారిక సర్టిఫికెట్‌తో పాటు మెడాలియన్ ఫర్ ఎక్సలెన్స్‌ను ప్రదానం చేశారు. విద్యార్థి సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కే. ప్రసాద్ ప్రముఖ నాయకత్వ గ్రంథం "స్టార్ట్ విత్ వై" పుస్తకాన్ని బహుమతిగా అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ఆర్.శ్రీనివాసరావు, అకడమిక్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.హెచ్.ఎం.కృష్ణ ప్రసాద్, యూసీఈకే ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మరాజు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ డి.లింగరాజు పాల్గొని విద్యార్థి సాంకేతిక నైపుణ్యం, అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా లీలకృష్ణ వేములపల్లి మాట్లాడుతూ, జేఎన్‌టీయూకేలో ఉన్న సాంకేతిక వాతావరణం, ప్రయోగాత్మక అభ్యాస అవకాశాలు తన విజయానికి ఎంతో దోహదపడ్డాయని తెలిపారు. అలాగే తన ప్రాజెక్టులకు 1995–1999 బ్యాచ్‌కు చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అలుమ్ని ద్వారా రూ.1.57 లక్షల ఆర్థిక సహాయం అందినట్టు ఆయన పేర్కొన్నారు. అలుమ్ని మద్దతుతో, మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కె. మీరా సాహెబ్ మార్గదర్శకత్వంలో ప్రస్తుతం రెండు వినూత్న ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వాటిలో ఒకటి వన్యప్రాణులను పర్యవేక్షిస్తూ వేటగాళ్లను గుర్తించే వైల్డ్‌లైఫ్ మానిటరింగ్ మరియు సర్వైలెన్స్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్, మరొకటి విద్యుత్ లైన్ల నుంచి శక్తిని సేకరించి తిరిగి రీచార్జ్ చేసుకునే పవర్–లైన్ హార్వెస్టింగ్ మరియు రీచార్జింగ్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ ప్రోటోటైపులు అని ఆయన వివరించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మరియు విశ్వవిద్యాలయ పరిపాలన లీలకృష్ణ వేములపల్లిని అభినందిస్తూ, యువ ఇంజినీర్లలో సృజనాత్మకత, ప్రయోగాత్మక నైపుణ్యాలు మరియు అధునాతన పరిశోధనలను ప్రోత్సహించేందుకు జేఎన్‌టీయూకే కట్టుబడి ఉందని తెలిపారు.

# ప్రపంచ కిడ్నీ దినోత్సవంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ & పి.జి కళాశాల (ఎ) జాతీయ సేవా పథకం వాలంటీర్లు ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ వారు భానుగుడి నుండి వివేకానంద పార్కు వరకు నిర్వహించిన వాక్‌థాన్ అవగాహన ర్యాలీలో పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ అందరికంటే ధనవంతుడు, అదృష్టవంతుడు ఈ ప్రపంచంలో ఒక్క ఆరోగ్యవంతుడేనని, సమతుల్య ఆహారం, జీవనశైలి, వ్యాయామం, ఆరోగ్య సమతుల్యతను కాపాడుతుందని అన్నారు. రోజుకి సరిపడ నీరు త్రాగుతూ మన మూత్రపిండాలను రక్షించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ అర్బన్ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొని వాక్‌థాన్‌ను ప్రారంభించారని తెలిపారు. దినచర్యలో ఒడిదుడుకులు, మానసిక ఒత్తిడి వలన గుండెవ్యాధులు, మూత్రపిండ వ్యాధులు, దీర్ఘకాలిక సమస్యలు ఎక్కువ అవుతున్నాయని, సమతుల్యత అవసరమని అన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ కిడ్నీ




సమస్యలు ఎక్కువ అవుతున్నాయని, తగిన నీరు తీసుకోకపోవటం, వ్యాయామం లేకపోవడం, ఆహారపు అలవాట్లు కారణమని అన్నారు. భానుగుడి నుండి ర్యాలీని ఆరంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్, జాతీయ సేవా పథకం కార్యనిర్వహణాధికారి పి. సురేఖ దేవి, కె.నవ్య, మెడికవర్ మేనేజర్ అభిలాష్, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# తహసిల్దార్ కార్యాలయంలో వాచ్ డాగ్ సమావేశం

– పాల్గొన్న తహశీల్దార్ వెంకటలక్ష్మి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణ, మండల పరిధిలో గల గ్రామాల్లో ప్రభుత్వ చెరువులు, కాలువలు, ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దాపురం తాహసిల్దార్ కార్యాలయంలో తహల్దారు సిహెచ్ వెంకటలక్ష్మి వీఆర్వోలు, ఇరిగేషన్ సిబ్బందితో వాచ్ డాగ్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా తహశీల్దార్ తెలుపుతూ మండలంలో ఎక్కడా చెరువులు, కాలువలు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని, అటువంటివి ఉంటే వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఏ ఈ కుమార్, డిటి ప్రసాద్, రమణ, వీఆర్వోలు సునీత, గంగాధర్, వెంకటేశ్వరరావు, వాకాడ శ్రీను, ప్రసాద్, బంగారమ్మ, కిరణ్, భరత్, రాంబాబు, అప్పారావు, యేసు ప్రసాద్‌తో పాటు పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాల మైదానాన్ని అభివృద్ధి చేయాలి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట జూనియర్ కళాశాల మైదానాన్ని పట్టణ ప్రజల సౌకర్యార్థం అన్ని విధాల అభివృద్ధి చేయాలని బహుజన్ దర్బార్ సామర్లకోటకు చెందిన నాయకులు ఎమ్మెల్యే చిన రాజప్పకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బహుజన్ దర్బార్ నాయకులు కాకర ప్రసాద్ మాట్లాడుతూ సామర్లకోట జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం సాయంత్రం వందలాది మంది రోజు వారి వ్యాయామంలో భాగంగా వాకింగ్ మరియు జాగింగ్ కు రావడం జరుగుతుందని, మైదానంలో వాకింగ్ ట్రాక్ చిన్నపాటి వర్షం పడితే వాకింగ్ చేసే మహిళలు వృద్ధులు అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. అలాగే మైదానంలో అనుకూల స్థలంలో ఓపెన్ జిమ్ ను సైతం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చినరాజప్పకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. జూనియర్ కళాశాల మైదానంలో ఉన్న సమస్యలపై ప్రత్యేక చొరవ చూపించి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన్ దర్బార్ సభ్యులు నీలం మోహన్, పులపకూర ప్రవీణ్, దుగ్గాడ వెంకట్, సతీష్ రవితేజ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

సామర్లకోట, మేజర్ న్యూస్ : 10 వ తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని, విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్సీ మూర్తి కోరారు. సామర్లకోట మండలం మాధవపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థుల కోసం సరస్వతి పూజలు నిర్వహించారు. మేడిశెట్టి నాని ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సరస్వతి పూజల్లో ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.



## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ వేణు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** పిఠాపురం నుండి సామర్లకోట ఆటోలో ప్రయాణిస్తూ ఇద్దరు ప్రయాణికులు ఆటో డిక్కీలో ఒక బ్యాగ్‌ను పెట్టి సామర్లకోటలో దిగాక బ్యాగ్ మర్చిపోయి వెళ్లిపోయి, కొద్ది సేపటి తరువాత బ్యాగ్ విషయము గుర్తుకు వచ్చి చూసుకుని ప్రయాణికులు కన్నీటి పర్యంతమయ్యారు. బ్యాగ్‌లో ఒక నల్లపూసలు దండ, ఒక నక్లేస్, డబ్బులు ఉన్నాయి. ఆటో డ్రైవర్ తిరిగి పిఠాపురం వెళ్లిపోతూ మధ్యలో ఆగి ఆటో వెనక డోర్ వేయడానికి అని దిగి చూడగా డిక్కీలో బ్యాగ్ చూసి మళ్ళీ సామర్లకోట శ్రీ సాయి గణపతి ఆటో యూనియన్ స్టాండ్‌కి వచ్చి ఆ ప్రయాణికులకు బ్యాగ్‌ను అప్పగించడం జరిగింది. ఆటో డ్రైవర్ వేణు నిజాయితీని పలువురు అభినందించారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

## రావులపాలెం సచివాలయం -5లో అధికారులచే ఇళ్ల కొలతల సర్వే



**రావులపాలెం, మేజర్ న్యూస్** : స్వమిత స్కీం అనేది గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలపై యజమాన్య హక్కులను నమోదు చేయడానికి భారత ప్రభుత్వం ప్రారంభించిన ఒక ముఖ్యమైన పథకం. ఈ పథకాన్ని మినిస్ట్రీస్ ఆఫ్ పంచాయతీ రాజ్ అమలు చేస్తుంది మరియు సాంకేతిక సహాయం సర్వే ఆఫ్ ఇండియా అందిస్తుందని కార్యదర్శి పద్మ పేర్కొన్నారు. రావులపాలెం గ్రామం డాక్టర్ చిర్ల సోమ సుందర్ రెడ్డి కొత్త కాలనీలో నిర్వహించారు. ఈ సర్వేలో డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించి గ్రామాల్లోని ఇళ్ల స్థలాలను ఖచ్చితంగా మ్యాప్ చేస్తారని ఆ వివరాల ఆధారంగా ప్రతి యజమానికి ప్రాపర్టీ కార్డ్ (ప్రాపర్టీ కార్డు ) జారీ చేస్తారని ఈ కార్డ్ ద్వారా ఆ వ్యక్తి ఆ స్థలానికి చట్టబద్ధమైన యజమాని అని నిర్ధారించబడుతుంది.

గ్రామాల్లో ఇళ్ల స్థలాలపై స్పష్టమైన యజమాన్య హక్కులు ఇవ్వడం, భూమి మరియు ఆస్తి వివాదాలను తగ్గించడం, గ్రామాల్లో సరైన ఆస్తి రికార్డులను రూపొందించడం, ప్రాపర్టీ కార్డ్ ద్వారా బ్యాంక్ రుణాలు పొందే అవకాశం కల్పించడం, గ్రామపంచాయతీలకు పన్నులు సేకరించడం సులభం చేయడం ఈ సర్వే లక్ష్యాలు.స్వామిత్వ సర్వే ప్రక్రియలో ముందుగా గ్రామంలో డ్రోన్ ద్వారా మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. ఆ మ్యాప్ ఆధారంగా ప్రతి ఇల్లు లేదా స్థలానికి సరిహద్దులు నిర్ణయిస్తారు. గ్రామస్థులు ఆ వివరాలను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే తెలియజేస్తారు. తుది ధృవీకరణ తర్వాత ప్రాపర్టీ కార్డులు జారీ చేస్తారని అలాగే స్వామిత్వ సర్వే ద్వారా గ్రామాల్లోని ఇళ్ల స్థలాలకు అధికారిక యజమాన్య రికార్డులు తయారు చేసి, గ్రామీణ ప్రజలకు భద్రత మరియు ఆర్థిక అవకాశాలు కల్పించడం లక్ష్యం అని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వి.ఆర్.ఓ సిహెచ్.వేంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జె.రాగశ్రీ, ఏ.పెర్సిస్ మరియు మహిళా పోలీస్ బి.వరలక్ష్మీ పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణే లక్ష్యం





**– అన్నవరం, కత్తిపూడి జంక్షన్లలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు**

**అన్నవరం, మేజర్‌న్యూస్** : కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పెద్దాపురం ఇంచార్జ్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఎస్‌డిపిఓ మరియు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కే.వి. సత్యనారాయణ ఆదేశాలతో, ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.సూర్య అప్పారావు పర్యవేక్షణలో అన్నవరం మరియు కత్తిపూడి ఆర్టీసీ బస్టాండ్ల వద్ద ప్రమాదకరమైన మలుపుల వద్ద కొత్తగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు.గత ఏడాది కాలంలో ఈ నిర్దిష్ట ప్రాంతాలలో మొత్తం 8 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ దుర్ఘటనలలో నలుగురు ప్రాణాలు కోల్పోగా,13మందికి పైగాతీవ్ర గాయాలపాలయ్యారు. వాహనాల మితిమీరిన వేగమే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణమని గుర్తించిన అధికారులు,తక్షణ నివారణ చర్యగా స్పీడ్ బ్రేకర్లను వేయించారు. ఈ సందర్భంగా అన్నవరం ఎస్ఐ శ్రీహరి బాబు మాట్లాడుతూ "ప్రజల ప్రాణ రక్షణే మా మొదటి ప్రాధాన్యత. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ స్పీడ్ బ్రేకర్లను గమనించి వాహనదారులు వేగం తగ్గించి వెళ్లాలి. మలుపుల వద్ద అజాగ్రత్తగా ఉండవద్దు" అని కోరారు.పోలీస్ శాఖ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల స్థానిక గ్రామస్తులు మరియు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో ప్రాణనష్టం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ధరణి రమణారావును సన్మానించిన ఎమ్మెల్యే కొండబాబు



కాకినాడ, మేజర్ న్యూస్ : ఎంతో ప్రతిష్టాత్మకమైన రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా ఎన్నికైన ఆధ్యాత్మిక చింతనాపరులు, సమాజ సేవకులు, ధరణి కన్స్ట్రక్షన్స్ అధినేత, క్రెడాయ్ కాకినాడ బ్రాంచ్ కార్యదర్శి టీ.వీ. రమణారావు ను కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి కొండబాబు దృశ్యాలు వాతో సత్కరించి పుష్పకుచంతో అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ సమాజ అవసరాలకు అనుగుణంగా రోటరీ చేస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా రమణ రావు ఎంతమందికి సేవలు అందించారని అన్నారు. కాకినాడ నగరంలో రోటరీ క్లబ్ ద్వారా నిర్వహించే అనేక కార్యక్రమాలలో తాను పాల్గొన్నానని ఎంతో స్ఫూర్తిదాయకమనిపించింది అన్నారు. కాకినాడ రోటరీ క్లబ్ అధ్యక్షులుగా రమణారావు ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఆధ్యాత్మిక పరంగా కాకినాడ రామారావుపేట శివాలయానికి భక్తునిగా అనేక అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు తన వంతు కర్తవ్యాన్ని నెరవేర్చారని ఎమ్మెల్యే కొండబాబు కొనియాడారు. ప్రజా సంక్షేమానికి తాము నిర్వహించే అనేక కార్యక్ర మాలలో భాగస్వామ్యం వహిస్తూ సమాజం పట్ల ఉన్న తన కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నారని అన్నారు.ధరణి టీ.వీ. రమణ రావు మాట్లాడుతూ అంతర్జాతీయ రోటరీ ప్రపంచంలోకి ఎల్.సత్యనారాయణ (టిక్కు) ఆహ్వానం మేరకు సభ్యత్వం స్వీకరించానని అన్నారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ శిక్షణా తరగతుల్లో పిడిజి ఎం.వీరభద్ర రెడ్డి (బాబి) సూచనల మేరకు అనేక విషయాలను అవగాహన చేసుకున్నానని చెప్పారు. తన పరిధిలో ఉన్న రోటరీ క్లబ్ కాకినాడ, రోటరీ స్మార్ట్ సిటీ, రోటరీ ఎలైట్, రోటరీ సెంటర్ క్లబ్ మరియు రోటరీ క్లబ్ పెద్దాపురం సామ్రాజ్యాలకు చెందిన అందరిని సమన్వయం చేసుకుంటూ 2026-27 సంవత్సరంలో రోటరీ గవర్నర్ గుత్తి కొండా శ్రీరామ్ సూచనలతో అనేక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వివరించారు.

## చొప్పెల్ల హోటల్‌పై విజిలెన్స్ దాడులు

**– తొమ్మిది గ్యాస్ సిలెండర్లు స్వాధీనం**



**ఆలమూరు, మేజర్ న్యూస్** : ప్రస్తుతం వంట గ్యాస్ కొరత ఏర్పడినందున విజిలెన్స్ అధికారులు హోటల్స్‌పై దాడులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల జాతీయ రహదారిపై ఉన్న ఓ హోటల్ పై గురువారం రాజమహేంద్రవరం విజిలెన్స్, స్థానిక సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించారు. అయితే హోటల్ నిర్వాహకుడికి కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో లేనందున తొమ్మిది గృహ వినియోగానికి సంబంధించిన సిలిండర్లు వాడుతున్నట్లు గుర్తించి వాటిని స్వాధీన పరుచుకున్నారు. వాటిని గ్యాస్ గొడౌన్‌కు తరలించి 6ఎ కేసు నమోదు చేసినట్లు ఆలమూరు మండల సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

## 2వ విద్యాశాఖాధికారుల నూతన కార్యవర్గం ఎన్నిక



**అడ్డతీగల, మేజర్ న్యూస్** : నూతన పోలవరం జిల్లా పరిధిలోని 12 మండలాలలో విద్యాశాఖ కార్యాలయాల్లో రెండవ విద్యాశాఖ అధికాంలుగా సేవలందిస్తున్న జిల్లా పరిషత్తు పరిధిలోని అధికారు లంతా తమ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గానికి రాజవొమ్మంగి మండల విద్యాశాఖ అధికారి-2గా పనిచేస్తున్న సూరయ్య రెడ్డి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు . సెక్రటరీగా గంగవరం మండలంలో పనిచేస్తున్న మల్లేశ్వరరావు అడ్డతీగల మండలం నుండి పి.శ్రీనివాసరావు కోశాధికారిగా ఎన్నికైనట్లు కార్యవర్గ సభ్యులు వెల్లడించారు. ఎన్నికైన వీరిని సభ్యులు బాలు దర వెంకటేశ్వర్లు రాజులు, లక్ష్మయ్య బాబురావు బలపరిచి ఆమోదించారు. ఎన్నికల్లో రంపచోడవరం చింతూరు డివిజన్ పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులు-2 అంతా పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లు ప్రారంభం

**– వినియోగదారులకు మరింత చేరువలో సేవలు**



**కొత్తపేట, మేజర్ న్యూస్** : వినియోగదారులకు మరింత చేరువలో సేవలు అందించేందుకు బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఐ.టి.ఎస్ పలివెల రాజు తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక కొత్తపేట బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్చేంజిలో గల ఓసిఎస్సి కస్టమర్ సర్వీస్ సెంటర్స్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పి జి ఎం మాట్లాడుతూ కొత్తపేట అంబాజీపేట ముమ్మిడివరం మండపేట పరిసర ప్రాంత ప్రజల కోరిక మేరకు కస్టమర్ సర్వీస్ సెంటర్లు ఫ్రాంచైజి విశాలి ఎంటర్ప్రైజెస్ శిరిగినీడి ఆదినారాయణకు కేటాయించినట్లు తెలిపారు. బిఎస్ఎన్ఎల్ భాగస్వామ్యంతో మరిన్ని ఓసిఎస్సీలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆ మేరకు వినియోగదా రులకు మరింత చేరువ అవుతామని తెలిపారు. 4జి సేవలు ఫైబర్ నెట్ సేవలు అన్ని గ్రామాలకు విస్తరింప చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీ.జీ.ఎంలు సి.హెచ్.విజయభాస్కర్ రెడ్డి, శైలజ, ఐ.ఎఫ్.ఓ నాగరాజు, ఏ.జీ.ఎంలు భమిడిపాటి శ్రీనివాసు, శారద డీ.ఈ ఆర్.ఫణీంద్ర, పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# రూ.4.10 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం





- మంత్రి సుభాష్ కృషితో అభివృద్ధి వేగవంతం
- కె.గంగవరం మండలంలో బిటి రోడ్లకు శంకుస్థాపన చేసిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం

**కె.గంగవరం,మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అన్నారు. కె .గంగవరం మండలంలో రూ.4.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రెండు బిటి రోడ్లకు ఆయన శుక్రవారం ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు.రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కోటిపల్లి - పిల్లంక రోడ్డు, రూ.1.10 కోట్లతో నిర్మించనున్న పామర్రు-ఉట్రుమిల్లి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషి వల్ల నియోజకవర్గానికి భారీ స్థాయిలో నిధులు రావడం సాధ్యమైందన్నారు. గత 20 నెలల్లోనే సుమారు రూ.220 కోట్లకు పైగా నిధులు రప్పించి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు. రోడ్లు, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, అమలాపురం పార్లమెంట్ కార్యదర్శి సిర్రా సురేష్, రేవు శ్రీను, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ ఆధ్వర్యంలో త్రాగునీటి మరమ్మతులు పూర్తి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** 4వ వార్డు కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం త్రాగు నీటి మరమ్మతులు పూర్తి చేసి కుళాయిలు ద్వారా నీరు అందచేశారు. సామర్లకోట బ్రౌన్ పేట సెంటర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పార్క్‌లో బోరు పాడై నీరు సరఫరా కాకపోవడంతో ఐదు వార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 4వార్డు కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి న విషయం, గురువారం వార్త ప్రచురితమైన కావడం విదితమే. కాగా శుక్రవారం మున్సిపల్ అధికారులు స్పందించి బోరు మరమ్మత్తు పనులు హుటాహుటిన చేపట్టి, పనులు పూర్తి చేసి నీటిని వార్డు ప్రజలకు సరఫరా చేశారు.

## సీఎం ఫోటో చిన్నదిగా వేసి అవమానిస్తున్నారు

- టిడిపి అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్ వర్మ



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ప్రతి కార్యక్రమంలోనూ సీఎం ఫోటో చిన్నదిగా వేసి అవమానిస్తున్నారంటూ టిడిపి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రపై పారిశుధ్య కార్మికులకు శిక్షణ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో వేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటో చిన్నది వేశారంటూ వర్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శిక్షణ కార్యక్రమం మధ్యలోంచి ఆయన వెనుదిరిగారు. అనంతరం వర్మ మీడియాతో మాట్లాడుతూ... అధికారులు తరచుగా ప్రోటోకాల్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, ఇటువంటి ఘటనలు గతంలో కూడా జరిగాయని ఆరోపించారు. గత జనవరిలో జరిగిన సంక్రాంతి సంబరాల ఫ్లెక్సీలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటో వేయలేదన్నారు. శిక్షణా కార్యక్రమం ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్టాంప్ సైజు ఫోటో వేసి అవమానించారన్నారు. ఇటువంటి ఘటనలు పిఠాపురంలో నిత్యం జరుగుతున్నాయని, బయటికి చెప్పుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రేయర్ ఫర్ స్టూడెంట్స్‌లో దైవజనులు



సామర్లకోట, మేజర్ న్యూస్ : విద్యార్థులు దైవ జ్ఞానంతో పరీక్షలకు సిద్ధపడితే విజయాలు మీ సొంతం అవుతాయని సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెవ. ఏ చంటి, ఉపాధ్యక్షులు రెవ. ఏ స్టీవెన్ కింగ్, నోవా టీవీ ఛానల్ వ్యవస్థాపకులు, డా. వల్లూరి నోవా హులు అన్నారు. సామర్లకోట పట్టణంలోని సిపిఎం హై స్కూల్ గ్రౌండ్‌లో పదో తరగతి పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థుల విజయం కోసం "ప్రేయర్ ఫర్ స్టూడెంట్స్" కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలో నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దైవజనులు మాట్లాడుతూ విద్యార్థులంతా ఏకాగ్రతతో, దేవుని పట్ల ఆసక్తి కలిగి దైవ జ్ఞానాన్ని కోరుతూ సిద్ధపడాలన్నారు. సెల్ఫోన్లకు దూరంగా ఉండి అధిక సమయం విద్యాభ్యాసానికి కేటాయించి పరీక్షలు మంచిగా రాయాలన్నారు. ఈ సందర్భంగా నోవా టివి వ్యవస్థాపకులు డాక్టర్ వల్లూరి నోవాహు అందించిన పరీక్ష ప్యాడ్లను, అసోసియేషన్ కోశాధికారి బిషప్ ఎం రాజేష్ అందించిన పెన్నులను, అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్ధం చేసిన హాల్ టికెట్ పౌచ్లను, శీతల పానీయాలు, బిస్కెట్ ప్యాకెట్లను విద్యార్థులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రెవ. డా. పి ఆనంద్ బాబు, రెవ. డా.పి ప్రభుదాసు, ఏ పీటర్, బిషప్ ఏ ఇమ్మానుయేల్ పాల్, ఆర్ సత్యం, డి అబ్రహాము, జి.విశ్వాసరావు, బి బాబురావు, పి బన్ను ప్రసాద్, కే జయబాబు, రెవ. వి జాన్, బిషప్ డా. టి బ్లెస్సింగ్, ఎం రాజు, ఎస్ సైలాస్, ఎం జె కృపాకర్, జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ నాయకులు ఎండి వి ప్రసాద్, గిడియన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు నవీన్ ఆనంద్, ఈ జాకబ్ జియాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

- పీసీసీ అధ్యక్షురాలు వై.యస్ షర్మిల రెడ్డి

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో రాజన్న సంక్షేమ పాలన కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే సాధ్యమని పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి అన్నారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్చార్జ్ మరోతు శివ గణేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా వైయస్ షర్మిల రెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా షర్మిల రెడ్డి మాట్లాడుతూ దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి 5 సంవత్సరాలు మాత్రమే రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. ఐదేళ్లలో బడుగు బలహీన వర్గాలకు అవసరమయ్యే పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఆ పథకాల్లో భాగంగానే పేద విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, ఆరోగ్య శ్రీ పథకం, రైతు రుణమాఫీ ఇటువంటి పథకాలు ఎన్నో ప్రవేశపెట్టిన ఘనత రాజశేఖర్ రెడ్డికే చెల్లిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో రాజశేఖర్ రెడ్డి ఇటువంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే రాజశేఖర్ రెడ్డి మాత్రమేనని షర్మిల రెడ్డి పేర్కొన్నారు. ఈ పథకాల్లో భాగంగా ముఖ్యమైన పథకం ఉపాధి పథకమని అటువంటి పథకాన్ని బిజెపి ప్రభుత్వం నీరు కారుస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి పేదవాడు పస్తులతో పడుకోకూడదని వారికి పని కల్పించి కూడు, గుడ్డ సమకూర్చుకునేలా మంచి ఆలోచనతో రాజశేఖర్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ఈ ఉపాధి హామీ పథకం బిల్లు ప్రవేశపెడితే అధికార పార్టీ గానీ ప్రతిపక్ష పార్టీ గాని ఆ దమ్ము ధైర్యం ఉందని షర్మిల రెడ్డి అన్నారు. మన భారతదేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందంటే అది ఆంధ్రప్రదేశ్ అని ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో రాజధాని కడుతున్న నిధులు కూడా కేంద్రం అప్పుగానిస్తుందని ఆమె చెప్పారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు ఉండి ఉంటే ఎప్పుడో రాజధాని నిర్మాణం అయ్యేదన్నారు. వైఎస్ఆర్సిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు బిజెపికి ఊడిగం చేస్తున్నాయని షర్మిల అన్నారు. కేంద్ర మాజీ మంత్రివర్యులు ఎం ఎం పల్లంరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఉపాధి పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక చట్ట సవరణలు చేసి పేదవాడికి ఉపయోగపడే విధంగా ప్రతి ఒక్కరికి పని కల్పించే దిశగా పథకాన్ని రూపొందించారు అన్నారు. అటువంటి పథకాన్ని బిజెపి నామరూపాలు లేకుండా చేసే ప్రయత్నం చేస్తుంది అన్నారు. కాట్రపల్లిలో నిర్వహించిన ఉపాయాన్ని పరిరక్షణ యాత్రలో భాగంగా రచ్చబండ కార్యక్రమంలో గ్రామస్తులు పలు సమస్యలను షర్మిల రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముందుగా జగ్గంపేట కాకినాడ రోడ్ లో ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి షర్మిల రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు సత్యానందరావు, పీసీసీ ఉపాధ్యక్షులు నక్క ప్రసాద్, నియోజవర్గం ఇంచార్జ్ నూకరాజు, కిసాన్ శాల అధ్యక్షులు ప్రభాకర్ రావు, స్థానిక నాయకులు శ్రీ వత్సవాయి బాబు, నక్క సత్తిబాబు, చంద్రమౌళి చిన్నారి, నకిరెడ్డి విష్ణు చక్కర్రావు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.



# హోం మంత్రి ఇలాకాలోనూ రక్షణ కరువు

**– పాయకరావుపేటలో బాలికపై అత్యాచార ఘటనపై జమ్మలమడక ఆగ్రహం**
**– నెల రోజులు నిర్భంధించి అత్యాచారం.. హోం మంత్రి ఇలాకాలో నిఘా ఏమైంది..**
**– గుట్టుచప్పుడు కాకుండా నిందితుడిని రిమాండ్‌కి తరలింపు వెనుక ఉన్న మతలబు ఏంటి?**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తోన్న పాయకరావుపేట నియోజకవర్గంలో మహిళలకు రక్షణ కరవైందని మండిపడ్డారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళా హోం మంత్రిగా అనిత హంగు ఆర్భాటాలకు పోవడం తప్ప రాష్ట్రంలో శాంతిభద్రతల పర్యవేక్షణపై కనీస అవగాహన ఉందా అని ప్రశ్నించారు. అనిత సొంత నియోజకవర్గంలో మైనర్ బాలికపై కామాంధుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఏకంగా నెల రోజుల పాటు బాలికను నిర్భంధించి అత్యాచారానికి పాల్పడటమే కాకుండా వీడియోలను చిత్రీకరించడం దారుణమన్నారు. అటువంటి కేసులో పోలీసులు వ్యవహరించిన తీరును ఆమె తప్పుబట్టారు. నిందితుడిని చడీచప్పుడు లేకుండా మీడియాకు వివరాలను వెల్లడించకుండా రహస్యంగా అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో తరచూ ఆడబిడ్డలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. నిందితులను కఠినంగా శిక్షించకుండా చెరువుల్లో శవంగా తేలే పరిస్థితులను ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కల్పిస్తుందా అన్న అనుమానాలు ఉత్పన్నం అవుతున్నాయని పేర్కొన్నారు. గతంలో తుని నియోజకవర్గంలో జరిగిన బాలికపై అత్యాచార ఘటనలో ఆరోపణలు ఎదుర్కొన్న వృద్ధుడు మరుసటి రోజు చెరువులో శవంగా తేలాడని గుర్తు చేసారు.. ఇదే తరహాలో మదనపల్లిలో మరోక ఘటన జరిగిందని పేర్కొన్నారు. వరుస ఘటనలు జరుగుతున్నా హోం మంత్రి అనిత నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహరించడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులపై హోం మంత్రి అనిత స్పందిస్తున్న తీరు బాధాకరం అన్నారు. మరోవైపు ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లో పాడైపోయిన ఆహారాన్ని అందించడం సిగ్గు చేటన్నారు. దీన్ని బట్టీ చూస్తుంటే వెనకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులంటే ప్రభుత్వానికి, ఆ శాఖ మంత్రి లోకేష్‌కు ఎంత చులకనో అర్ధం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తాజాగా మంత్రి లోకేష్ త్రిసభ్య కమిటీ నియమిస్తూ స్పందించిన తీరు విస్మయానికి గురి చేసిందన్నారు. విద్యార్థినులు ఆహారం బాలేదని పడేస్తున్న వీడియోలు కనిపిస్తుంటే చర్యలు తీసుకోకుండా కమిటీలతో కాలయాపన చేయడమేంటని సూటిగా ప్రశ్నించారు జమ్మలమడక నాగమణి.

# వంటగ్యాస్ కొరతపై వదంతులు నమ్మవద్దు

**– గొల్లప్రోలు బిజెపి పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు**



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** సోషల్ మీడియా మరియు యూట్యూబ్ వేదికగా వంటగ్యాస్ కొరతపై వస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని గొల్లప్రోలు బిజెపి పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 17,962 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా గ్యాస్ కొరత లేదని, డెలివరీ కేంద్ర ప్రభుత్వ కొత్త నిబంధనల ప్రకారం, గ్యాస్ బుక్ చేసిన 2 నుండి 5 రోజుల్లోపు సిలిండర్ వినియోగదారుడికి అందేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. గృహ వినియోగదారులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూనే, అత్యవసర రంగాలకు కూడా గ్యాస్ సరఫరా నిరంతరాయంగా కొనసాగు తుందన్నారు. ఒకవేళ గ్యాస్ బుక్ చేసిన తర్వాత నిర్ణీత సమయంలో డెలివరీ కాకపోతే, వినియోగదారులు నేరుగా ఆయిల్ కంపెనీలకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు. డెలివరీ ఆలస్యం అయితే ఇండియన్ గ్యాస్ వినియోగదారులు 1800233555 లేదా 7718955555కు, భారత్ గ్యాస్ కస్టమర్లు 180022-4344 లేదా 77 15012345, హెచ్ పి గ్యాస్ వినియోగదారులు 1800 -233555 లేదా 9493602222 కాల్ చేసి ఫిర్యాదు ఇవ్వవచ్చని అన్నారు.

# ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్‌కి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**– రోడ్ ట్యాక్స్ చెల్లిస్తే టోల్ ట్యాక్స్ ఎత్తివేయాలి**
**– వివిధ ట్రాన్స్‌పోర్ట్ సంఘాల నాయకుల డిమాండ్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్స్‌కి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని నగరంలో వివిధ ట్రాన్స్ పోర్ట్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.శుక్రవారం ఉదయం కాకినాడ సుందరయ్య విజ్ఞానభవన్‌లో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దువ్వ శేషబాబ్జి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోటార్ లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎలిపే శ్రీనివాస్, మట్టా తిరుమల వెంకటరెడ్డి, లక్ష్మీగణపతి ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మరుకుర్తి నాగబాబు, టాటా మ్యాజిక్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు వాలిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి కె. సత్తిబాబు, స్మార్ట్ సిటీ ప్యాసింజర్ ఆటో యూనియన్ నాయకులు నురుకుర్తి సూర్య ప్రకాష్ తదితరులు మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ కి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు ఫిట్‌నెస్ సెంటర్లు రద్దు చేసి ప్రభుత్వ రవాణా శాఖ ఆధ్వర్యంలోనే ఫిట్నెస్ జరగాలన్నారు. ప్రమాదాలు నివారణ, డ్రంక్ అండ్ డ్రైవ్ గురించి ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లకే అవగాహన కల్పిస్తున్నారని, సొంత వాహనదారులకు, ముఖ్యంగా విద్యార్థులకు కల్పించాలన్నారు. సుదూర ప్రాంతాల్లో ప్రమాదాలకు గురై మరణించిన డ్రైవర్ భౌతిక కాయాన్ని తన ఇంటికి చేర్చే ఏర్పాటు ప్రభుత్వమే చేయాలన్నారు. వెహికల్ లొకేషన్ ట్రేసింగ్ డివైస్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు మాత్రమే ఏర్పాటు చేయడం అంటే రవాణా రంగ సామర్థ్యాన్ని తెలుసుకోవడానికే జరుగుతుందన్నారు. ప్రైవేటు వ్యక్తిగత వాహనాలకు డివైస్ వేయడం లేదన్నారు. ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆటోలకు ఆయిల్ వేయించి, నెలకు 26,000 చెల్లిస్తే 60 కిలోమీటర్ల రేడియస్‌లో ప్రభుత్వ స్త్రీ శక్తి పథకంలో భాగస్వాములు అవుతామని తెలిపారు. రవాణా రంగ రక్షణకు ప్రభుత్వానికి విన్నవిస్తూ సంతకాలు సేకరణ చేయాలని, ఎమ్మెల్యేలు, ఎంపీలకు వినతి పత్రాలు సమర్పించాలని తీర్మానం చేసారు. మార్చి 24వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతి పత్రం సమర్పించాలని సమావేశం నిర్ణయించింది.ఈ సమావేశంలో యల్లబోయిన వీరభద్రం, బి.సత్యనారాయణ, సిహెచ్.దుర్గా ప్రసాద్, వి.రాజు, వి.వెంకన్న బాబు, బి.సురేష్, సిఐటియు నగర నాయకులు మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు, రూరల్ నాయకులు టి.రాజా పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

**– రైతు ఖాతాల్లో మూడో విడత నిధులు జమ**
**– ప్రభుత్వ విప్ యనమల దివ్య**



**తుని, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ పథకం కింద మూడవ విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. తుని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ యనమల దివ్య ముఖ్య అతిథిగా పాల్గొని, నిధుల పంపిణీని అట్టహాసంగా ప్రారంభించారు. ఏడాదికి రైతులకు రూ.20,000 పెట్టుబడి సాయం అందిస్తామన్న హామీ మేరకు, ఇప్పటికే రెండు విడతల్లో రూ.14,000 అందించిన ప్రభుత్వం, నేడు మూడవ విడతగా మిగిలిన రూ.6,000 మొత్తాన్ని విడుదల చేసింది. నియోజకవర్గ పరిధిలోని తుని, కోటనందూరు, తొండంగి మండలాలకు చెందిన 27,759 మంది రైతులకు మొత్తం రూ.54.34 కోట్లు నేరుగావారి ఖాతాల్లో జమ చేయబడ్డాయి.

మండలాల వారీగా లబ్ధి వివరాలు:

తుని మండలం: 11,427 మంది రైతులకు – రూ.22,29,40,000.

తొండంగి మండలం: 8,564 మంది రైతులకు – రూ.16,59,62,000.

కోటనందూరు మండలం: 7,876 మంది రైతులకు – రూ.15,62,88,000.

ఈ సందర్భంగా యనమల దివ్య మాట్లాడుతూ, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు ప్రయోజనాలే పరమావధిగా 'సూపర్ సిక్స్' పథకాలను విజయవంతంగాఅమలుచేస్తున్నారనికొనియాడారు. ప్రధానమంత్రి మోదీ మరియు సీఎం చంద్రబాబు సంయుక్త కృషితో అన్నదాతలకు ఈ ఆర్థిక ఊతం అందుతోందని ఆమె పేర్కొన్నారు. అనంతరం, రైతులకు సంబంధించిన మెగా చెక్కును నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, సీనియర్ నాయకులు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, యినగంటి సత్యనారాయణ, ఎంపీపీ బొప్పన రాము మరియు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కానూరు పిహెచ్సి పరిధిలో హెచ్‌పివీ వ్యాక్సిన్ క్యాంపెయిన్



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కే.హేమరాజు ఆధ్వర్యంలో గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ నుండి బాలికల రక్షణకు ప్రభుత్వము వారిచే ఉచిత వాక్సినేషన్ క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కానూరు పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉన్న 14 సంవత్సరముల పూర్తి అయ్యి 15 సంవత్సరాలలోపు ఆడబిడ్డల అందరికీ గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రాకుండా ముందు జాగ్రత్తగా గార్డసిల్ అనే హ్యూమన్ పప్పిలోమా వైరస్ (హెచ్ పి వి) వాక్సినేషన్ ఉచిత క్యాంపెయిన్ మార్చ్ 10వ తారీకు శుక్రవారం నుండి ప్రభుత్వము వారిచే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కానూరులో ప్రారంభోత్సవం జరిగింది. ఇందుకు గాను గత కొద్ది రోజుల నుండి గ్రామంలో ఏ ఎన్ ఎం మరియు ఆశా వర్కర్లు ఇంటింటి సర్వే చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 251 బాలికలను లబ్ధిదారులుగా గుర్తించడమైనది. గురువారం పెండ్యాల, కాకరపర్రు గ్రామం పరిధిలో గల 14 సంవత్సరం పూర్తి అయి 15 సంవత్సరం జరుగుతున్న 19 బాలికలకు వాక్సిన్ వేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భావన మధు పూర్ణచందు, నడుపల్లి గ్రామ సర్పంచ్ బీర సత్యవేణి రాజు వైద్య ఆరోగ్య సిబ్బంది కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కే.హేమరాజు, సిహెచ్ ఓ కే.జయమణి, యమ్పిహెచ్ఈ ఓ ఏ.రాజమోహన్, సూపెర్వైజర్స్ కె.వి.నాగేశ్వరావు సిబ్బంది ఏఎన్ఎమ్ కె.చిన్నారి, యస్. రేవతి, టీ.స్వప్న, హెల్త్ అసిస్టెంట్, ఆశాలు పాల్గొన్నారు.

# అన్నదాతల సంక్షేమమే లక్ష్యం






**– అన్నదాత సుఖీభవ మూడో విడత పంపిణీలో ఎమ్మెల్యే బండారు**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వ పాలనలో అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ మూడవ విడత పంపిణీలో భాగంగా ఆత్రేయపురంలో జరిగిన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిధుల విడుదల సందర్భంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాలను తిలకించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని పేర్కొన్నారు. గోదారమ్మ దయవల్ల మన ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ మూడవ విడతలో భాగంగా కొత్తపేట నియోజకవర్గంలో నేడు 23,085 మంది అన్నదాతల ఖాతాల్లో రూ.12.94 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. కొత్తపేట మండలంలో 6516 మంది అన్నదాతలకు రూ.3.57 కోట్లు, ఆత్రేయపురం మండలంలో 5,258 మందికి రూ.3.03 కోట్లు, రావులపాలెం మండలంలోని 5,018 మంది అన్నదాతలకు రూ.2.72 కోట్లు, ఆలమూరు మండలంలో 6293 మంది అన్నదాతలకు రూ.3.62 కోట్లు జమవుతుందన్నారు. పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ మొదటి విడతలో భాగంగా నియోజకవర్గంలో రూ.16.11 కోట్లు, రెండవ విడతలో భాగంగా రూ.15.26 కోట్లు రైతులు ఖాతాల్లో జమ అయ్యాయని పేర్కొన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయం మీద, డిమాండ్ ఆధారిత పంటల సాగు మీద దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో రైతులు పడ్డ కష్టాలు అన్ని ఇన్ని కావన్నారు. రైతు భరోసా పేరుతో ఏడాదికి ఒకే దఫాలో రూ.12,500 ఇస్తామని హామీ ఇచ్చి 3 దఫాల్లో కలిపి రూ.7,500 మాత్రమే ఇచ్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో పీఎం కిసాన్ కింద ఏడాదికి రూ.6వేలు అందిస్తుంటే.. దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం రూ.14వేలు కలిపి మొత్తం ఏడాదికి రూ.20,000 ఇచ్చి తమది రైతు పక్షపాత ప్రభుత్వమని నిరూపించుకున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 46,85,838 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా దన్నుగా ఉంటుందన్నారు. రాయితీలపై వ్యవసాయ పరికరాలు ఇచ్చి సాగు రంగంలో సాంకేతికత జోడిస్తున్నామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతు కల్లంలో ధాన్యం అమ్మగానే 24 గంటల్లో నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ డబ్బులు రావడానికి సుమారు ఆరు నెలలు పట్టేదని గుర్తు చేశారు. 2026–27 రాష్ట్ర బడ్జెట్ లో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.53,752.12 కోట్లు కేటాయించి ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు, నాయకులు ఆకుల రామకృష్ణ, ముదునూరి రాంబద్ర రాజు, ముల్లపూడి భాస్కరరావు తదితరులు ఉన్నారు.

# నేటినుండి మాతృశ్రీ గడి బాపనమ్మ తిరునాళ్లు






**– ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రజల ఆరాధ్య దైవం మాతృశ్రీ గడి బాపనమ్మ జాతర మహోత్సవాలు ఈనెల 14వ తేదీ నుండి 18వ తేదీ వరకు ఐదు రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఏట కొత్త అమావాస్య ఉగాదికి ముందు బాపనమ్మ అమ్మవారి తిరునాళ్లు రంగ రంగ వైభవంగా జరుగుతాయి. పోలవరం జిల్లా రంపచోడవరం మండలం సీతపల్లి సమీపంలో గోకవరం ప్రధాన రహదారికి పక్కనే బాపనమ్మ ఆలయంలో అమ్మవారు పూజలు అందుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతం మీదుగా రాకపోకలు సాగించే మోటారు వాహనాల సిబ్బంది, ప్రజలు, ప్రయాణికులు, పర్యాటకులు అమ్మవారి ఆలయం వద్ద ఆగి దర్శించుకోవడం, పూజలు చేయడం ఆనవాయితీగా కొనసాగుతుంది. ఏజెన్సీ ప్రజలే కాకుండా పట్టణ ప్రాంతాల నుండి వేల సంఖ్యలో భక్తులు బాపనమ్మ అమ్మవారి ఆలయానికి నిత్యం వస్తుంటారు. అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాల అలంకరణతో తిరునాళ్ళు ఐదు రోజులు ప్రత్యేక కుంకుమ పూజలు, గరగలు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి వాతావరణం నెలకొంటుంది. ఈ ఆలయం ది.19–01–1990 సం॥ నుండిరాష్ట్ర దేవదాయధర్మదాయ శాఖ పాలనలో కొనసాగుతున్నది. శ్రీ అమ్మవారి ఆలయ పునఃనిర్మాణం, ప్రారంభోత్సవం ది.14–03–2012లో జరిగింది.బాపనమ్మ అమ్మవారి స్థల పురాణం..పూర్వకాలంలో అనపర్తి, ఇప్పనపాడు పరిసర గ్రామాల నుండి గోవులు మేపుట కొరకై ఏజెన్సీ ప్రాంతానికి (అటవీ ప్రాంతం) వస్తూ ఉండేవారు.ఆ గోవులతో అమ్మవారు ఏజెన్సీ ప్రాంతానికి తరలివచ్చి సీతపల్లి గ్రామ పొలిమేరలో ప్రశాంత వాతావరణంలో సేద తీరి అక్కడే అంతఃర్థానం అయిపోయినట్లు, తిరిగి వెళ్ళలేదని స్థల పురాణం బట్టి తెలుస్తుంది. ఆనాటి నుండి ఈనాటి వరకు భక్తులు కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న గ్రామ దేవతగా మాతృశ్రీ గడిబాపనమ్మ అమ్మవారు పూజలు అందుకుంటున్నారు. ఈ ఏజెన్సీ ప్రాంతం రామాయణ కాలంలో రాముడు, సీతాదేవితో అరణ్యవాసం చేసే సమయంలో క్షణకాలం ఇక్కడ సేదతీరడం వల్ల సీతపల్లి గ్రామంగా పేరు పొందింది. 1970–71 సంవత్సరములో బాపనమ్మ అమ్మవారికి ఆలయ నిర్మాణం జరిగింది. ఆనాడు ఆలయ నిర్మాణం గోకవరం నేషనల్ ఏజెన్సీ మోటార్ వర్కర్స్ ఓనర్స్, సీతపల్లి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భక్తులు విరాళాలతో ఆలయ నిర్మాణం జరిగింది. అంతవరకు అమ్మవారు పూర్వకాలం నుండి వెదురు పొదల మధ్య ఈత ఆకుల పాకలో ఉండేవారు. అమ్మవారిని బ్రిటీష్ కాలంలో విప్లవ వీరుడూ అల్లూరి సీతారామరాజు పూజించినట్లు చరిత్ర చెబుతుంది. అమ్మవారు రెండు కాలువల మధ్య అటవీ ప్రదేశంలో వెదురు పొదలలో స్వయంభుగా వెలిశారు. ప్రస్తుతం ఈ వెదురు పొదల అమ్మవారు ఆలయం ప్రక్కనే ఇప్పటికి ఉన్నాయి. అనపర్తి గ్రామంలో రెడ్డి కులస్థుల కుటుంబంలో బాపనమ్మ అనే అమ్మాయి ఉండేదని, ఆమెకు యుక్త వయస్సు వచ్చాక పెళ్ళి చేద్దామని తల్లిదండ్రులు సంబంధాలు చూసారు. పెళ్ళివారు వచ్చిన తరువాత, నాకు పెళ్ళి వద్దని, దేవతను అవుతానని సీతపల్లి పరిసర ప్రాంతంలోని అటవీ ప్రాంతానికి వచ్చినట్టు చెబుతారు. తల్లిదండ్రులు కలలో వారి కుమార్తె బాపనమ్మ కనిపించి నేను ఫలానా చోట ప్రతిమనై ఉన్నానని చెప్పినట్లు, తల్లిదండ్రులు అక్కడకి వెళ్ళి చూడగా ఆమె అక్కడ ఉన్నట్లు గుర్తుగా పసుపు, కుంకుమ చల్లివుందని పూర్వీకులు చెబుతారు. వెదురు పొదలలో ఉన్న ప్రతిమను మాతృశ్రీ గడిబాపనమ్మ అమ్మవారిగా పూజించడం అనాటి నుండి జరుగుతున్నది.

## శ్రీ వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో చండీ హోమం



అన్నవరం, మేజర్ న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన, శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో, క్షేత్ర పాలకురాలిగా విరాజిల్లుతున్న, శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో, శుక్రవారం సందర్భంగా ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీ వనదుర్గ అమ్మవారిని వివిధ రకముల పుష్పములతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, వ్రత పురోహితులు, అమ్మవారికి శ్రీ సూక్తం, పురుష సూక్తం, మూల మంత్రములు, నవగ్రహ అర్చన నిర్వహించి, 11 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించిన భక్తులకు, వేద పండితులు వేద ఆశీర్వచనం గావించగా, ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ అర్చకులు, వ్రత పురోహితులు, దేవస్థానం అధికారులు, భక్తులు, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేజీబీవిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




**చింతూరు, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా చింతూరు మండల కేంద్రంలోని కేజీబీవి పాఠశాల మరియు కళాశాల నందు 6వ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయిందని పాఠశాల ప్రిన్సిపాల్ డి.రమాదేవి శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. 2026–27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి లో 40సీట్లకు అలాగే ఇంటర్ మొదటి సంవత్సరానికి గాను 40 సీట్లకు విద్యార్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆన్లైన్ మరియు ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ దరఖాస్తులను మార్చి 12 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు స్వీకరిస్తామని అన్నారు. కనుక ఆసక్తి గల విద్యార్థులు ఈ చక్కటి అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## టెన్త్ విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేసిన ఏపీఐఐసీ డైరెక్టర్ పెద్దిరాజు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న స్థానిక జిల్లా పరిషత్ విద్యార్థులకు మండల టిడిపి అధ్యక్షులు, ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శివకృష్ణ, పి ఎంసి చైర్మన్ మరిచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల పరీక్షల సన్నద్ధత కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎపిఐఐసి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు హాజరయ్యి పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం పెద్దిరాజు స్వంత ఖర్చులతో విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మిరియాల వెంకట రమణ, ఉదయ్ కుమార్, పెదిరెడ్ల సత్తిబాబు, ప్రశాంత్ వర్మ, పదవ తరగతి బోధించు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చిన్నారుల 'కంటి'కి ఎంపీ సానా సతీష్ బాబు భరోసా




ట్విట్టర్ లో అభినందించిన లోకేష్



రాజ్యసభ సభ్యులు సానా సతీష్

## – మంత్రి నారా లోకేష్ ప్రశంసల జల్లు!

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** సామాజిక బాధ్యతతో సానా సతీష్ బాబు ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కొనియాడారు. ఏలూరు జిల్లాలో ఎంపీ సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "చిన్నారి కంటి సంరక్షణ" కార్యక్రమంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

11,000 మంది విద్యార్థులకు ఉచిత పరీక్షలు :ప్రభుత్వ పాఠశాలల్లో చదివే చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ఈ పక్షోత్సవాల విశేషాలు ఇలా ఉన్నాయి:

- లక్ష్యం: ఏలూరు జిల్లాలోని 60 ప్రభుత్వ పాఠశాలలు.
- లబ్ధిదారులు: 11,000 మందికి పైగా విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు.
- సహాయం: దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్లజోడులు, అవసరమైన వారికి మందుల పంపిణీ.

సేవా గుణానికి నిదర్శనం

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఎంపీ సానా సతీష్ బాబు గారు చేస్తున్న కృషి ప్రశంసనీయం. చదువుకునే వయస్సులో దృష్టి లోపాలు ఉంటే పిల్లల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుంది. అటువంటి లోపాలను గుర్తించి, సకాలంలో వైద్యం అందించడం గొప్ప విషయం" అని అన్నారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సానా సతీష్ బాబు ఫౌండేషన్ ప్రతినిధులకు, వైద్యులకు మరియు నిరంతరం శ్రమిస్తున్న వాలంటీర్లకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఇటువంటి మరిన్ని సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

## శ్రీ సత్యదేవుని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పిఎస్ కృష్ణ తేజ



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనార్థం డిప్యూటీ సీఎం పిఎస్ కృష్ణ శ్రీ సత్యదేవుని సన్నిధికి శుక్రవారం విచ్చేశారు. ముందుగా ఆలయ అధికారులు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా దేవస్థానం ఈ ఓ వేంద్ర త్రినాథరావు శ్రీ స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం, అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, ఏఈఓ దామోర కృష్ణారావు, ఆలయ సూపరిండెంట్ రమణ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షన్‌లో కాకినాడకు మెరుగైన ర్యాంక్ లక్ష్యం

### – అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్



**కాకినాడ,మేజర్ న్యూస్ :** దేశవ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షన్‌లో కాకినాడ నగరం మంచి ర్యాంక్ సాధించాలనే లక్ష్యంతో కార్పొరేషన్ అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణ పనులను స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా మెయిన్ రోడ్డు, వార్ఫు రోడ్డు, సామర్లకోట రోడ్డు ప్రాంతాల్లో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డోర్ టు డోర్ చెత్త సేకరణ విధానాన్ని కూడా అదనపు కమిషనర్ పరిశీలించారు. చెత్తను సమయానికి సేకరించడంతో పాటు ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన రాజ్ ట్యాంక్ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. అక్కడ అల్పాహారం చేస్తున్న ప్రజలను పలకరించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహార నాణ్యత, నిర్వహణ విధానం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

# దివ్యాంగ బాలునికి వీల్ చైర్ అందజేత

### – మానవతా హృదయంతో ముందుకొచ్చిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** సమాజ సేవలో ఎప్పుడూ ముందుండే సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ మరోసారి తన మానవతా సేవను చాటుకుంది. రామచంద్రపురం నియోజవర్గం కె.గంగవరం మండలం తాళ్లపూడి పంచాయతీ భీమ్‌నగర్‌కు చెందిన దివ్యాంగ బాలుడు మోర్త సాయి కు ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మూడు చక్రాల వీల్‌చైర్‌ను అందజేశారు. శుక్రవారం రామచంద్రపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వాసంశెట్టి సత్యంను కలిసిన బాలుడి తల్లి మోర్త రాజేశ్వరి తన కుమారుడి ఆరోగ్య పరిస్థితిని వివరించి సహాయం కోరారు. ఆమె వినతిని సానుభూతితో విన్న వాసంశెట్టి సత్యం వెంటనే స్పందించి, బాలుడి సౌకర్యార్థం మూడు చక్రాల వీల్‌చైర్‌ను అందజేసి ఆర్థిక సహాయం కూడా అందించారు. సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సమాజంలో ఆపన్నులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అవసరమైన చోట సేవ చేయడం ద్వారానే నిజమైన సంతృప్తి లభిస్తుందని అన్నారు. దివ్యాంగులు సమాజంలో ధైర్యంగా ముందుకు సాగేందుకు తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని తెలిపారు. అంతేకాకుండా బాలుడి పరిస్థితిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకెళ్లి, అతనికి దివ్యాంగుల పింఛన్ మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అవసర సమయంలో సహాయం అందించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్‌కు బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కంచుమర్తి బాబురావు, కవల నానాజీ, కాటే సుబ్రమణ్యం, ఏసుదాసు, రమణ తదితరులు పాల్గొన్నారు.

## గోపాలపురం పి.హెచ్.సి.లో హెచ్‌పివీ వ్యాక్సిన్ పంపిణి



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం మండలం,గోపాలపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పివి వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి, అనపర్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ, క్యాన్సర్‌కు కారణమయ్యే హ్యూమన్ పాపిల్లోమా వైరస్ ఇన్ఫెక్షన్లను ముఖ్యంగా గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారించే అత్యంత ప్రభావంతమైన టీకా ఇదని, 9 సంవత్సరాలనుండి 45 సంవత్సరాల మధ్య ముఖ్యంగా (11-12 సంవత్సరాలు) స్త్రీ పురుషులకు రక్షణ కల్పిస్తుందని, ఈ టీకా హెచ్‌పివి వ్యాక్సిన్ వల్ల కలిగే ఇన్ఫెక్షన్లను ఆపై క్యాన్సర్‌ను నిరోదిధిస్తుందని, ఈ టీకా వేయని వారితో పోలిస్తే వ్యాక్సిన్ తీసుకున్న వారిలో హెచ్‌పివి ఇన్ఫెక్షన్ గణనీయంగా తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయని ఆకుల రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వాతి మాట్లాడుతూ, 14 సంవత్సరాల వయసున్న బాలికలకు వ్యాక్సిన్ సిద్ధంగా ఉందని, వారన్నారు. డాక్టర్ స్వాతి, హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి, ఎంపిహెచ్ఈఓ భాస్కర్ రెడ్డి, సూపర్ వైజర్ సత్యనారాయణ, హెచ్.వి.ఇందిర, ఏఎన్ఎం దైవ కృప, పద్మ, ఆశా వర్కర్లు మేరీ మనీ, నాగలక్ష్మి, నారాయణమ్మ విద్యార్థిని విద్యార్థులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల టీం ప్రజలు పాల్గొన్నారు.

## అన్నవరం శ్రీ సత్యదేవునికి లక్ష రూపాయల విలువైన పట్టు వస్త్రాల సమర్పణ



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్య నారాయణ స్వామివారి దేవస్థానంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిభావం వెల్లివిరిసింది. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా, విశాఖపట్నంకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సీఎంఆర్ అధినేత శ్రీ మావూరి వెంకటరమణ స్వామివారిపై ఉన్న తన భక్తిని చాటుకున్నారు. శ్రీ మావూరి వెంకటరమణ శ్రీ స్వామివారికి, అమ్మవారికి మరియు దేవస్థాన ప్రాంగణంలోని అన్ని ఉపాలయాల్లో కొలువై ఉన్న దేవతామూర్తులకు కలిపి సుమారు రూ.1,00,000లు విలువైన పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉగాది నాడు స్వామివారిని కొత్త వస్త్రాలతో అలంకరించడం ఆనవాయితీ అని, ఈ పవిత్ర కార్యంలో భాగస్వామ్యం కావడం తన అదృష్టమని దాత ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆలయ అధికారులు మరియు అర్చకులు దాతకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి, ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమంలో డిసి బాబురావు, ఏఈఓ దామోర కృష్ణారావు, ఆలయ ప్రధాన అర్చకులు కోట సుబ్బయ్య, సుధీర్, నాగభట్ల రవి పాల్గొన్నారు.

## శ్రీ మరిడమ్మ అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కే.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు శుక్రవారం, బంగారు వెండి పుష్పములతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈపూజా కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. వీరికి శ్రీ అమ్మవారి తీర్ద ప్రసాదాలు అందించడం జరిగింది. దేవస్థానం సిబ్బంది, వేద పండితులు పాల్గొన్నారు.